సాక్షి
చిత్తూరు
శుక్రవారం। 15। ఆగస్టు। 2025


స్వాతంత్ర్య దినోత్సవానికి సిద్ధమైన వేదిక

సర్వం సిద్ధం

చిత్తూరు నగరంలో ఆదివారం నిర్వహించనున్న 79వ స్వాతంత్ర్య దినోత్సవానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీసు, రెవెన్యూ యంత్రాంగంతో పాటు నగర పాలక సంస్థ అధికారులు ఏర్పాట్లలో బిజీబిజీగా గడిపారు. నగరంలోని పోలీసు శిక్షణా కేంద్రంలో రంగవల్లులు అద్దారు. మైదానాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాక ఆవిష్కరణ చేయనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఉదయం 8.25 గంటల నుంచి పంద్రాగస్టు వేడుకలు ప్రారంభంకానున్నాయి. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు, ప్రశంసా పత్రాల పంపిణీ, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ, స్టాల్స్ పరిశీలన ఉంటుంది. కాగా పలు శాఖలు రూపొందించిన శకటాలు, ఆస్తుల ప్రదర్శన కూడా జరగనుంది.

- చిత్తూరు అర్బన్


చిత్తూరు పోలీసు శిక్షణా మైదానంలో రంగవల్లులు


మాక్ పరేడ్‌లో చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

జెండా..మది నిండా!



చిత్తూరు నగరంలో గురువారం జెండా పండగ సందడి నెలకొంది. బజారువీధి, చర్చివీధి, కొంగారెడ్డిపల్లి, గిరింపేట, సంతపేట ప్రాంతాల్లో జాతీయ జెండాల విక్రయాలు జోరందుకున్నాయి. రూ.100 నుంచి రూ.1000 వరకు వివిధ రకాల సైజుల్లో స్లాండ్ జెండాలు, స్టిక్కర్లు విక్రయించారు. త్రివర్ణ బ్యాండ్‌లు, జెండా వస్తువులు భారీగా అమ్ముడుబోయాయి. - చిత్తూరు రూరల్ (కాణిపాకం)

న్యూస్‌రీల్

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా?


శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

వి.కోట : రాష్ట్రంలో అస్సలు ప్రజాస్వామ్యం ఉందా..? అని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ప్రశ్నించారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల తీరు చూస్తే అసలు మనం ప్రజాస్వామ్య రాష్ట్రంలో ఉన్నామా అన్న అనుమానం వస్తోందని వాపోయారు. గురువారం మండలంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ బూత్‌లలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఏజెంట్లు లేకుండా ఎన్నికలు నిర్వహించారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన రాష్ట్ర ఎన్నికల కమిషన్ దారుణమైన పాత్ర పోషించడం దురదృష్టకరమన్నారు. ఎన్నికలు జరిగిన 15 పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాల పర్యవేక్షణలో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. మీరు ప్రజాస్వామ్య బద్ధంగా గెలిసుంటే రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని రద్దు చేసి ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు.

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

ఉమ్మడి జిల్లా ప్రజానీకానికి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతి భారతీయుడు గర్వంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు పంచాయతీల్లో గ్రామసభలు

చిత్తూర కార్పొరేషన్ : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలను నిర్వహించాలని డీపీఓ సుధాకర్‌రావ్ తెలిపారు. పునరుత్పాదక ఇంధన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, పశుసంవర్ధకశాఖ సహకారంతో కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించి వాటి సంరక్షణ చర్యలు తీసుకోవడం, పంచాయతీల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలు చేయడంపై ప్రధానంగా గ్రామసభల్లో చర్చించి తీర్మానాలు చేయాలని కేంద్రం సూచించిందన్నారు.

డీఎస్సీ స్కోర్ కార్డులు

చిత్తూరు కలెక్టరేట్ : సవరించిన టెట్ మార్కులతో డీఎస్సీ అభ్యర్థుల స్కోర్ కార్డులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్టు డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మెగా డీఎస్సీ తుది కీ, స్కోరు కార్డులను ఇది వరకే విడుదల చేశారన్నారు. అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత సవరించిన టెట్ మార్కులతో అనుసంధానించిన స్కోర్ కార్డులను www.apdsc.apcfss.in వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. సవరించిన స్కోరు కార్డులను ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని డీఎస్సీ అభ్యర్థులు సరిచూసుకోవాలన్నారు. టెట్ మార్కుల స్కోరు కార్డులో ఏవైనా అభ్యంతరాలున్నట్‌లెత్తై అభ్యర్థి ఐడీ నెంబర్‌తో వెబ్‌సైట్‌లో సరిచేసుకోవాలని డీఈఓ సూచించారు.

ఆంక్షల బస్సు

ఉచిత బస్సు ప్రయాణంపై మహిళలు పెదవి విరుస్తున్నారు. ఏడాదికి పైగా ఊరించి ఉస్సూరుమనిపించారు. నేడు ఉచిత బస్సు ప్రకటనపై..షరతులు వర్తిస్తాయంటూ ప్రభుత్వం ఎన్నో మెలికలు పెట్టింది. గతంలో రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితమని ఆర్భాటం చేశారు. కానీ నేడు అమల్లోకి వచ్చేసరికి కొన్ని బస్సుల్లోనే ఉచితం అంటూ ఆంక్షలు పెట్టడంపై మహిళా లోకం మండిపడుతోంది. పల్లె వెలుగులో సుదూర ప్రాంతాలకు సాధ్యమయ్యేపనికాదని మహిళలు నిట్టూరుస్తున్నారు. ఇంతదానికి హామీలు ఇవ్వడం దేనికంటూ ఆవేదన వ్యక్తం అవుతోంది.

సాధారణ బస్సుల్లో మాత్రమే ఉచితం

- అల్ట్రా, పల్లె వెలుగు, సాధారణ ఎక్స్‌ప్రెస్‌లలో మాత్రమే అవకాశం
- రాష్ట్ర మంతా ఉచితంగా వెళ్లాలంటే వీటిలో సాధ్యమేనా?
- తిరుమలకు వెళ్లాలన్నా టికెట్ కొనాల్సిందే.. ఉచితంలో అన్నీ షరతులే
- కడుపు కొడుతున్నారంటూ ఆటో వాలాలు, టాక్సీ డ్రైవర్ల ఆందోళన

సాక్షి ప్రతినిధి, తిరుపతి : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో ప్రభుత్వం ఎన్నో మెలికలు పెట్టింది. 15 నెలల తరువాత అమలు చేయనున్న ఈ పథకంలో అన్ని బస్సుల్లో ఉచితం కాదు. కొన్ని బస్సుల్లో మాత్రమే. అవి కూడా అరకొర బస్సులు.. అందులోనూ డొక్కు బస్సుల్లో మాత్రమే. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అంతంతే.. అరకొర బస్సుల్లో ఉచితంపై ఆటో, టాక్సీ వాలాలు భగ్గుమంటున్నారు. ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తే తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి భయపడి కూటమి నేతలు ప్రభుత్వం ఏర్పాటై ఏడాది తరువాత నేటి సాయంత్రం నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

తిరుపతి, చిత్తూరు జిల్లాలో మొత్తం 24 లక్షల మందికిపైగా మహిళలు ఉన్నారు. అయితే ఆర్టీసీ బస్సులు మాత్రం కేవలం 1418 మాత్రమే ఉన్నాయి. ఇందులోనూ ఉచిత ప్రయాణానికి అవకాశం ఉన్న బస్సులు కేవలం 663 బస్సులు మాత్రమే. మిగిలిన 755 బస్సుల్లో ప్రయాణించాలంటే టికెట్ కొనాల్సిందే. తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లి రావాలన్నా టికెట్ కొనక తప్పదు.

హవ్వ..పల్లె వెలుగులో రాష్ట్రం అంతా!.

పథకాల అమలులో నిబంధనలు పెట్టి తామూ అమలు చేస్తున్నాం అని చెప్పుకోవడంపై జనాలు మండిపడుతున్నారు. రాష్ట్రంలో ప్రముఖ ఆలయాలు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లి రావాలంటే పల్లెవెలుగు, సాధారణ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేసే వీలుంటుందా? అని ప్రశ్నిస్తున్నారు. ఉదాహరణకు విజయవాడకు వెళ్లి రావాలంటే నేరుగా పల్లెవెలుగు, సాధారణ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో వెళ్లి రాగలమా? అని ప్రశ్నిస్తున్నారు. ఆ బస్సుల్లో ప్రయాణిస్తే ఎన్ని బస్సులు మారాలి? ఎప్పుడు గమ్యస్థానానికి చేరాలి? తిరిగి నివాసానికి ఎప్పుడు రావాలి? అని నిలదీస్తున్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లా ప్రజలు తమ చెంతే ఉన్న తిరుమలకు వెళ్లి రావడానికి వీలులేని ఉచిత బస్సులు ఎందుకు? అని నిట్టూరుస్తున్నారు.




తిరుపతి : మెడకు ఉరి తగిలించుకొని ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల నిరసన

ఉపాధి చూపించాలని నిరసనలు

ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా.. పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న తిరుపతి, చిత్తూరు జిల్లాలో నిత్యం 70 నుంచి లక్ష మంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్తుంటారు. పర్యాటకులు, భక్తులపై ఆధారపడి అనేక మంది నిరుద్యోగులు అప్పులు చేసి ఆటోలు, టాక్సీలు కొనుగోలు చేసి తిప్పుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మహిళలకు ఉచితం పేరుతో ఉన్న కొన్ని బస్సులు వారికి కేటాయిస్తే తమ పరిస్థితి ఏంటని ఆటో, టాక్సీ వాలాలు కూటమి నేతలను ప్రశ్నిస్తున్నారు. అందులో భాగంగా గురువారం తిరుపతిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉచిత ప్రయాణం ఇస్తే ఇవ్వండి అయితే తమకు ఉపాధి అవకాశాలు చూపించమని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తిరుపతి జిల్లాలో మొత్తం బస్సులు	955
చిత్తూరు జిల్లాలో మొత్తం బస్సులు	463
మొత్తం	1418

ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉన్న బస్సులు

పల్లె వెలుగు	506
అల్ట్రా పల్లె వెలుగు	06
సాధారణ ఎక్స్‌ప్రెస్‌లు	151
మొత్తం	663

ఈ బస్సుల్లో ప్రయాణించాలంటే టికెట్ కొనాల్సిందే!

సప్తగిరి ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ విద్యుత్ బస్సులు, అమరావతి, ఇంద్ర తిరుమలకు వెళ్లి వచ్చే బస్సులు

ఇంకెందుకు ఉచిత ప్రయాణం



ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. అన్ని బస్సుల్లో కాదంట కదా. తిరుమలకే వెళ్లడానికి వీల్లేదంట కదా.. దగ్గరలో ఉన్న ఏడుకొండల స్వామి దర్శనానికి వెళ్లి రావడానికి లేనప్పుడు ఇంకెందుకు ఈ ఉచిత బస్సు ప్రయాణం.

- పుష్ప, చిత్తూరు

ఉపాధి అవకాశాలు కల్పించండి



మా తల్లిదండ్రులు పెద్ద చదువులు చదివించలేకపోయారు. చదివిన చదువుతో ఉద్యోగాలు దొరకడం లేదు. అప్పు చేసి ఆటో కొనుగోలు చేశా. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నా. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటున్నారు. ఇస్తే ఇవ్వండి.. కానీ మాకు ఉపాధి అవకాశాలు కల్పించండి. ఉపాధి లేకపోతే మా పరిస్థితేంటి.?

- జ్ఞానశేఖర్, ఆటోడ్రైవర్ , చిత్తూరు

వైఎస్సార్‌సీపీ యువజన విభాగంలో పదవులు

తిరుపతి అర్బన్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు యువ నేతలకు రాష్ట్ర యువజన విభాగ కమిటీలో వివిధ హోదాల్లో పదవులు కల్పించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఆ జాబితాను ప్రకటించింది. పుంగనూరు నియోజకవర్గానికి చెందిన మిద్దింటి కిషోర్‌బాబుకు రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీ, శ్రీకాళహస్తి అసెంబ్లీ పరిధిలోని కంతా ఉదయకుమార్ సెక్రటరీ, డీజే సుధీర్‌కుమార్ జాయింట్ సెక్రటరీగా అవకాశం కల్పించారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి


విద్యాధరి , జాయింట్ కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించకూడదన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్జీకి పరిష్కారం చూపలేని పరిస్థితుల్లో స్పష్టంగా సమాధానం తెలియజేస్తూ అర్జీదారునికి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. అర్జీల పరిష్కారం పట్ల అలసత్వం వహిస్తే శాఖాపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పాటయినప్పటి నుంచి ఈనెల 13వ తేదీ వరకు 60,053 అర్జీలను స్వీకరించినట్టు తెలిపారు. కోర్టు కేసులకు వెంటనే కౌంటర్ ఫైల్ చేయాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వాస్పత్రుల్లో నెలకున్న సమస్యలను నివేదికల రూపంలో తెలియజేయాలన్నారు. హెచ్‌వోడీలు కచ్చితంగా ఫైళ్లను ఈ ఆఫీస్‌లోనే పంపాలని ఆదేశించారు.

పైసలిస్తేనే ఇంటి పట్టా!

- తిరుపతి జిల్లా, ఏర్పేడు మండలం, ముసిలిపేడు పరిధిలోని కొందరు ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 100 మందికి పట్టాలు మంజూరయ్యాయని రెవెన్యూకు చెందిన కింది స్థాయి అధికారి ఒకరు, టీడీపీ నాయకుడు కలిసి లబ్ధిదారులకు సమాచారం ఇచ్చారు. ఆపై ఒక్కొక్కరూ అడిగినంత ఇచ్చుకోవాలని వారు సదరు లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఒత్తిడి చేస్తున్నట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వారి స్థాయిని బట్టి రూ.20వేల నుంచి రూ.30వేల వరకు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. అడిగినంత ఇవ్వకపోతే మంజూరైన పట్టా రద్దు చేస్తానని బెదిరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. తాను వసూళ్లు చేసే డబ్బులు అందరికీ పంచాలని, అడిగినంత ఇస్తే ఏకంగా రిజిస్ట్రేషన్ కూడా చేసి ఇస్తానని నమ్మబలుకుతున్నట్లు సమాచారం.
- చిత్తూరు నగరం, రూరల్ పరిధిలో నివాస స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో నమోదు కోసం స్థానిక అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఆన్‌లైన్ కోసం, అఫిడవిట్ కోసం అంటూ రూ.500 అడుగుతున్నారు. అలా ఇప్పటికే అనేక మంది రూ.500 చొప్పున చెల్లించారు కూడా. ఆపై ఇంటి స్థలం మంజూరు కావాలంటే అడిగినంత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. నగర పరిధిలో ఇంటి స్థలం కావాలంటే రూ.25వేలు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. డబ్బులు ఇవ్వకపోతే ఇంటి స్థలం మంజూరు చేసే పరిస్థితి లేదని తెగేసి చెబుతున్నట్లు ఆవేదన చెందుతున్నారు.

.. ఇవి మచ్చుకు రెండు ఘటనలు మాత్రమే. చిత్తూరు, తిరుపతి జిల్లాలో అధికారులు, టీడీపీ నేతలు బరితెగించేశారు. పేదల అమాయకత్వాన్ని, అవసరాలను ఆసరాగా చేసుకుని చెలరేగిపోతున్నారు. వారు అడిగినంత ఇవ్వకపోతే మంజూరైన ఇంటి పట్టా కూడా రద్దు చేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో చేసేది లేక లబ్ధిదారులు వడ్డీలపై అప్పులు చేసి వారు అడిగినంత సమర్పించుకుంటున్నారు.


ముసిలిపేడు బీసీ కాలనీ

పట్టణాల్లో ఓ రేటు.. పల్లెల్లో మరో రేటు

- ఒక్కొక్కరూ రూ.20వేల నుంచి రూ.30వేలు ఇవ్వాలంట
- అడిగినంత ఇస్తేనే ఇంటి స్థలం మంజూరు
- కొత్తగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులపై ఒత్తిళ్లు
- వసూలైన డబ్బులు కింద స్థాయి నుంచి పై స్థాయి వరకు పంచాలంట
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అధికారులు, టీడీపీ నేతల వసూళ్ల పర్వం

సాక్షి ప్రతినిధి, తిరుపతి: పేద, మధ్య తరగతి వారి కల సొంత ఇల్లు. ఆ కలను సాకరం చేసుకునేందుకు చేయని ప్రయత్నం అంటూ ఉండదు. అటువంటి వారిని దృష్టిలో ఉంచుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎటువంటి రుసుము తీసుకోకుండా ఉచితంగా నివాస స్థలాలను కేటాయించింది. అవసరాన్ని బట్టి ప్రైవేటు భూములను సైతం కొనుగోలు చేసి ప్లాట్లు వేసి పేదలకు పంపిణీ చేసింది. అంతటితో ఆగకుండా పక్కాగృహాలు నిర్మించి ఇచ్చింది కూడా. ఇంటి స్థలాలు మంజూరు నుంచి నివాసాల్లో చేరేంత వరకు లబ్ధిదారులపై అధికారుల నుంచి ఎటువంటి ఒత్తిడీ ఉండేది కాదు. అదనంగా రూపాయి కూడా డిమాండ్ చేసిన దాఖలాలు లేవు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి జగనన్న కాలనీల్లో నిర్మాణాలు చేపట్టకుండా ఆపేశారు. చెల్లించాల్సిన బిల్లులు అటకెక్కించేశారు. అనేక ప్రాంతాల్లో జగనన్న కాలనీలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. లబ్ధిదారులే కొందరు సొంత డబ్బులు వెచ్చించి నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే.. ఇల్లులేని పేద వారికి నివాస స్థలాలు కేటాయించనున్నట్లు, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారు. దరఖాస్తు చేసుకోవడం నుంచి నివాస స్థలం మంజూరు, పక్కా భవన నిర్మాణం కోసం, విద్యుత్ సౌకర్యం కోసం అంటూ మామూళ్లకు తెగబడే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నట్లు అర్హులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వసూళ్లు షురూ!

కూటమి ప్రభుత్వం నివాస స్థలాల కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. కానీ ఈ విషయంపై చాలా మందికి అవగాహన లేక చాలా మంది దరఖాస్తు చేసుకోలేదు. చిత్తూరు జిల్లాలో కేవలం 1,478 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులకు గ్రామ కంఠాలు, లే అవుట్లలో పట్టాలు ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. గ్రామ కంఠాలు లేని ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకుని అందులో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామ కంఠాలు, లే అవుట్లు, ఆక్రమణకు గురైన స్థలాలు లేకపోతే భూములు కొనుగోలు చేస్తారా? లేదా? అనే విషయంపై స్పష్టత లేదు. ఇదిలా ఉంటే.. దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరిని కింది స్థాయి అధికారులు డబ్బులు వసూళ్లకు తెరలేపినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అందులో భాగంగా ఏర్పేడు మండలం, ముసిలిపేడు గ్రామానికి చెందిన కొందరు లబ్ధిదారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడంతో కలెక్టరేట్‌లో ఉన్న కొందరు మీడియా వారిని కలిసి ఇళ్ల స్థలాల పేరుతో జరుగుతున్న తతంగాన్నంతా వివరించడం గమనార్హం. తిరుపతి, రేణిగుంట, చిత్తూరు వంటి ప్రాంతాల్లో ఇంటి స్థలాలు కావాలంటే అధికారులు ఇంకెంత డిమాండ్ చేస్తారోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి వసూళ్లకు పాల్పడుతున్న కింది స్థాయి అధికారులు, టీడీపీ శ్రేణులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పులివెందుల ఎన్నికల్లో
ప్రజాస్వామ్యం ఖూనీ


ఆర్కేరోజా, మాజీ మంత్రి

నగరి : పులివెందుల ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని మాజీ మంత్రి ఆర్కేరోజా ఆరోపించారు. ఉప ఎన్నికలు జరిగిన తీరుపై ఆమె గురువారం ఈ మేరకు స్పందించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పులివెందుల జెడ్పీటీసీ పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 62 శాతం ఓట్లు సాధించిందన్నారు. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో జరిగిన ఎన్నికల్లోనే 62 శాతం ఓట్లు సాధించిన పార్టీకి అనుకూల వాతావరణం నెలకొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో 8.95 శాతం ఓట్లు రావడం ఏమిటన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాపితంగా అనుకూల గాలి వీచిన సమయంలో పులివెందుల జెడ్పీటీసీ పరిధిలో టీడీపీ సాధించింది 24 శాతం ఓట్లు మాత్రమే అన్నారు. అలాంటి పార్టీకి 88 శాతం ఓట్లు రావడం యావత్ రాష్ట్రాన్ని షాక్‌లో ముంచిందన్నారు. ఎన్నికల్లో పోటీచేసిన మరో ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులకి వరుసగా 0, 1, 2, 3, 4 ఓట్లు రావడం చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారన్నారు. అంటే పోటీ చేసిన అభ్యర్థి తాలుకా ఏజెంట్లు వారి కుటుంబ సభ్యులు కూడా వారికి ఓటు వేయరా?.. పోటీ చేసిన అభ్యర్థి కూడా తనకు తాను ఓటు వేసుకోడా? ఈ ఫలితాన్ని జనం ఎలా నమ్మాలన్నారు. అధికార దుర్వినియోగం, రౌడీయిజం, అవకతవకలే ఈ విజయం సాధించి పెట్టాయన్నారు.

జాతీయ రహదారి పనుల పరిశీలన


ఆర్డీఓతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

నగరి : చెన్నై, తిరుత్తణి, రేణిగుంట నేషనల్ హైవే 716 పనులను, 205 రహదారి వెడల్పు పనులను కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం పరిశీలించారు. జాతీయ రహదారి వెడల్పులో భాగంగా ఆలయాలు, నివాసాలు తొలగించనుండడంతో పాటు టోల్ ప్లాజా ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోతామన్న రైతుల నుంచి పలు వినతులు అందడంతో వాటిని ప్రత్యక్షంగా పరిశీలించడానికి ఆయన నగరికి విచ్చేశారు. సమస్య ఉత్పన్నమైన నెత్తంకండ్రిగ, వీకేఆర్‌పురం ప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. అక్కడకు చేరుకున్న స్థానికులు ఇప్పటికే జాతీయ రహదారికి 200 మీటర్ల మేర తమ స్థలాలను ఇచ్చేశారని, మిగిలిన స్థలాల్లో నివాసాలు ఏర్పరచుకున్నామన్నారు. అయితే ప్రస్తుతం ఈ ప్రాంతంలో టోల్ ప్లాజా ఏర్పాటు చేస్తున్నామని, అందుకు మళ్లీ స్థలం కావాలంటున్నారని, తాము చాలా నష్టపోతామని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. తమకు న్యాయం చెయ్యాలని కోరారు. ఈ అంశంపై జాతీయ రహదారి అధికారులతో చర్చించిన కలెక్టర్ రహదారి మ్యాపులు పరిశీలించి, జాతీయ రహదారికి సంబంధిత ఉన్నతాధికారులతో చర్చిస్తానన్నారు. ఆర్డీవో అనుపమ, డీఎస్పీ సయ్యద్ అబ్దుల్‌అజీజ్, తహసీల్దార్ రవికుమార్, సర్వేయర్ సురేష్, భూములు, నివాసాలు కోల్పోయే వారు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీజ్ చేసిన ఇసుక మాయం!



మాయమైన ఇసుక డంప్

పాలసముద్రం : మండంలోని బలిజకండ్రిగ సమీపం, తమిళనాడు సరిహద్దులో పోలీసులు సీజ్‌చేసిన ఇసుక మాయమైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ నాయకులు సుమారు 100 టిప్పర్లకుపైగా ఇసుకను తమిళనాడు సరిహద్దులో డంప్ చేశారు. ఆపై అక్కడి నుంచి రాత్రికి రాత్రి తరలించి సొమ్ము చేసుకోవడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇటీవల దాడులు నిర్వహించి ఇసుకను సీజ్ చేశారు. అయితే పోలీసుల కన్నుగప్పి టీడీపీ నాయకులు సీజ్ చేసిన ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్నారు. కానీ దీనిపై పోలీసులు నోరుమెదపకపోవడం గమనార్హం.

ఆగని గజదాడులు



పాళెం పంచాయతీలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పలు ప్రాంతాల్లో పంట పొలాలపై ఏనుగుల దాడులు ఆగడంలేదు. వారం రోజులుగా పాళెం సమీపంలోని చింతల వంకలో తిష్టవేసిన 16 ఏనుగుల గుంపు పగలు అక్కడే ఉండి రాత్రిపూట పంటలను నాశనం చేస్తున్నాయి. గురువారం తెల్ల వారుజామున ఏనుగుల గుంపు పాళెం పంచాయతీలోని కోటపల్లె, కల్లూరు సమీపం సైదుల్లా గుట్ట వద్ద ఉన్న పంట పొలాలను నాశనం చేశాయి. మామిడి చెట్లను పెరికి వేయడం, కొమ్మలు విరిచేయడం, కొబ్బరి చెట్లను ధ్వంసం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఉదయం వరకు ఏనుగుల గుంపు పంట పొలాల్లోనే తచ్చాడుతుండడంతో అన్నదాతలు అటువైపు వెళ్లలేని పరిస్థితి.

ఢిల్లీలో స్వాతంత్య్ర దినోత్సవానికి సర్పంచ్ భాగ్యవతి



ఢిల్లీకి వెళ్లేందుకు వచ్చిన ఆహ్వాన పత్రికను చూపుతున్న సర్పంచ్ భాగ్యవతి

చౌడేపల్లె: ఢిల్లీలో జరగబోయే స్వాతంత్య్ర దినోత్సవానికి గడ్డంవారిపల్లె సర్పంచ్ భాగ్యవతికి ఆహ్వానం అందింది. గురువారం జలశక్తి అభియాన్ మంత్రి మండళి ఆహ్వానం మేరకు భాగ్యవతి దంపతులు ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. అక్కడ జరగబోయే స్వాతంత్య్రదినోత్సవ వేడుకల్లో పాల్గొననున్నారు. గడ్డంవారిపల్లె పంచాయతీ పరిధిలో జరిగిన వాటర్‌షెడ్ పథకం అమలులో భాగంగా ఉత్తమ సేవలకు గాను ఈ ఆహ్వానం అందినట్టు పేర్కొన్నారు.

సమస్యలు గాలికి



వేతనాల కోసం ధర్నా చేస్తున్న గ్రీన్‌అంబాసిడర్లు(ఫైల్)

గ్రామాల్లో అపరిష్కృత సమస్యల పరిష్కారానికి నిర్వహించే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగుతోంది. ఇప్పటికి మూడు సార్లు నిర్వహించిన ఈ సమావేశాలతో ఒరిగింది శూన్యమే. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో జెడ్పీటీసీలు సమస్యలు ఏకరువు పెడుతున్నా పట్టించుకునే వారు లేరు. ఈ సారైనా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తారో లేదో వేచి చూడాలి మరి..!

మొక్కుబడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- హాజరుకాని అధికార గణం
- పేరుకుపోతున్న బకాయిలు
- 16న జిల్లా పరిషత్ 4వ సర్వసభ్య సమావేశం

చిత్తూరు కార్పొరేషన్ : ప్రజాసమస్యల పరిష్కారానికి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చక్కటి వేదిక. ఇందులో అనేక సమస్యలు పరిష్కరించడమే కాకుండా అభివృద్ధి పనులు, కొత్త నిర్ణయాల అమలు పట్ల చర్చించవచ్చు. అయితే ప్రతి సారీ ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న ఈ సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగుతోంది. ఈ సమావేశం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లా పరిధిలో నిర్వహిస్తారు. ఈ మూడు జిల్లాల కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులు హాజరైతే ఎన్నో సమస్యలు పరిష్కారమవుతాయి. అయితే ఇప్పటి వరకు తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు హాజరు కాలేదు. ఆయా జిల్లాల అధికారులు సైతం గైర్హాజరవుతున్నారు. దీంతో ఆయా జిల్లాల పరిధిలోని జెడ్పీటీసీలు సమావేశానికి హాజరై సమస్యలు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేకుండా పోతోంది.

ప్రతిసారీ అజెండాలో తప్పిదాలే

జిల్లా పరిషత్ సర్వసమావేశానికి అందజేసే అజెండాలో అన్ని శాఖల పరిధిలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల సమాచారం పొందుపరచాలి. అయితే అనేక శాఖల అధికారులు అజెండాలో తమ శాఖకు చెందిన సమాచారమే ఇవ్వడం లేదు. ఈ ఏడాది ఏప్రిల్ 29న నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి అందజేసిన అజెండాలో కేవలం 11 శాఖల సమాచారమే పొందుపరిచారు. ఆ సమాచారంలోనూ అనేక తప్పిదాలున్నాయి. చివరి నిమిషంలో పలు శాఖలు సమాచారం అందజేస్తుండడంతో చాలా తప్పిదాలు చోటు చేసుకుంటున్నాయి.

ప్రజాప్రతినిధుల జీతాలకే దిక్కులేదు

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో జెడ్పీటీసీ, సర్పంచ్‌ల జీతాలకు దిక్కులేదు. ఉమ్మడి జిల్లాలోని 65 మండలా జెడ్పీటీసీలకు నెలకు రూ.6వేల చొప్పున గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. కానీ అనేక నెలలుగా ఇవి పెండింగ్‌లో ఉండగా ఇప్పటికి రూ.1.7 కోట్లు రావాల్సి ఉంది. అలాగే సర్పంచ్‌లకు ఇవ్వాల్సిన రూ.3వేల గౌరవ వేతనం కూడా ఇవ్వడం లేదు. వారికి రూ.1.72 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి.

మామూళ్ల మత్తులో ఇంజినీరింగ్ శాఖ

ఇంజినీరింగ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. జిల్లా ఆర్‌అండ్‌బీ పరిధిలో 15 ఏఈలకుగాను ముగ్గురే ఉన్నారు. వీరే అన్ని నియోజకవర్గాలను పర్యవేక్షించాల్సి ఉంది. ప్రతి పనికీ పైసలు ఇవ్వనిదే చేయడం లేదని కాంట్రాక్టర్లు బహిరంగంగా చెబుతున్నారు. సంవత్సరాల కాలంగా ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ శాఖలకు ఇన్‌చార్జి ఎస్‌ఈలే దిక్కుగా మారారు. ఆర్‌డబ్ల్యూఎస్‌లో 50 మంది ఏఈలకు 34 మందే ఉన్నారు. ఇక పంచాయతీరాజ్‌లోనూ ఇన్‌చార్జ్‌ల పాలన సాగుతోంది. ఇక్కడ డీఈలు 15 మందికి గాను ఐదుగురు, 62 మంది ఏఈలకు గాను 37 మంది, ఇంజినీర్ సహాయకులు 504కు గాను 90 మంది కొరత ఉన్నారు. ట్రాన్స్‌కోలోనూ 40 మంది ఏఈలకు గాను దాదాపు 12 మంది తక్కువగా ఉన్నారు.

జాడలేని ఆర్థిక సంఘం నిధులు

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా వేధిస్తోంది. జెడ్పీ, పంచాయతీలకు కలిపి రూ.85 కోట్లు ఇవ్వగా వాటిని పల్లె పాలనకు కేటాయించాల్సి ఉంది. ఆ డబ్బులు మంజూరు చేయకుండా సతాయిస్తోందని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పల్లె పండుగ కింద పంచాయతీరాజ్ పరిధిలో రూ3.కోట్ల బిల్లులు రావాల్సి ఉంది.

సెస్ బకాయిలు రూ.36.4 కోట్లు

జిల్లాలోని గ్రంథాలయాలకు నగరపాలక, పంచాయతీల నుంచి వచ్చే సెస్ చెల్లించకుండా కూటమి ప్రభుత్వం వేధిస్తోంది. ప్రతినెలా ఉద్యోగుల జీతాలు, నిర్వహణ కలిపి మొత్తం రూ.80 లక్షలు అవుతుంది. ఉమ్మడి జిల్లా పరిధిలో సెస్ బకాయిలు రూ.36.40 కోట్లు రావాల్సి ఉంది.

గజదాడుల కట్టడిలో విఫలం



జిల్లాలో సంచరిస్తున్న ఏనుగులు(ఫైల్)

జిల్లాలో గజరాజుల దాడులు పెచ్చుమీరుతున్నాయి. కల్లూరు, సోమల, కుప్పం, పలమనేరు, బంగారుపాళ్యం, పుంగనూరు వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్, లైటింగ్ ఏర్పాటు చేయాలంటే రూ.20 కోట్లకు పైగా నిధులు అవసరం. ఇందులో చిత్తూరు రేంజ్ పరిధిలో 17 కి.మీ, కుప్పంలో 7 కి.మీ, పలమనేరులో 4 కి.మీ ఫెన్సింగ్ వేయాల్సి ఉంది. సమస్యాత్మకమైన మదుపుటేనుగులను నివారించాల్సిన అవసరం ఉంది.

పరిష్కారం కాని అన్నదాత కష్టాలు

జిల్లాలో అన్నదాతలు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లాకు 40,338 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అవసరం కాగా 26,350 క్వింటాళ్లు మాత్రమే కేటాయించింది. వ్యవసాయ రుణాలు రెన్యూవల్ చేసుకోవాలంటే అప్పటి వరకు ఉన్న మొత్తాన్ని పూర్తిగా చెల్లించాలని కొత్తగా మెలిక పెట్టారు. జిల్లాలో వేలాది మంది రైతులు వివిధ బ్యాంకుల్లో రూ.3,341 కోట్ల రుణం తీసుకుని అవస్థలు ఎదుర్కొంటున్నారు.

గ్రీన్ అంబాసిడర్ల వెతలు

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని గ్రీన్ అంబాసిడర్ల జీతాలు మంజూరు చేయడం లేదు. వారికి నెలకు ఇచ్చేది రూ.6 వేలు మాత్రమే. అది కూడా ఇవ్వకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని 1,977 మంది అవస్థలపాలవుతున్నారు. వారికి దాదాపు రూ.కోటి వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

నూతన విద్యుత్ సర్వీసులకు మీనమేషాలు

ఉమ్మడి జిల్లాలో డబ్బులు కట్టించుకొని విద్యుత్ ఇవ్వాల్సిన సర్వీసులు 4 వేలకు పైగా ఉన్నాయి. శాఖా పరంగా కట్టిన డబ్బులకంటే పలుకుబడి, అధికారులకు మామూళ్లు ఇచ్చుకున్నవారికే సర్వీసులు జిల్లా స్టోర్స్ నుంచి త్వరగా విడుదలవుతున్నాయి. అత్యవసర కోటా కింద పరికరాలు తీసుకునే వెసులుబాటు ఉన్నా అవి ఇచ్చిన దాఖలాలు లేవు.

ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.260 కోట్లు

ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇప్పటివరకు రూ.260 కోట్లకుపైగా ప్రయివేటు ఆస్పత్రులకు చెల్లించాల్సి ఉంది.

విద్యుత్ బకాయిలు రూ.500 కోట్లు

పలు ప్రభుత్వ శాఖలు, పంచాయతీల పరంగా రూ.500 కోట్ల మేర విద్యుత్ శాఖకు రావాల్సి ఉంది. ఇలాంటి మొండి బకాయిలపై అసలు దృష్టి పెట్టడం లేదు. వీటికి తోడు ఓ వైపు ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటు జోరుగా సాగుతోంది.

కాలనీల్లో మౌలిక వసతులు కరువు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా వేలాదిగా జగనన్న కాలనీలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ కాలనీల్లో మౌలిక వసతులను కల్పించడంలో అలసత్వం వహిస్తోంది. ఆ కాలనీల వైపు కన్నెత్తి కూడా చూడని పరిస్థితులున్నాయి.

ఫలితం శూన్యం

జెడ్పీ సమావేశాలంటే పలు శాఖల అధికారులకు లెక్క లేకుండా పోయింది. దీనిపై జెడ్పీ చైర్మన్, జెడ్పీటీసీలు హెచ్చరించినా ఫలితం లేకుండా పోతోంది. ముఖ్యంగా ఎస్‌హెచ్‌ఎఐ, అటవీశాఖ, విద్యుత్‌శాఖ, డ్వామా, డీఆర్‌డీఏ, డీఎంఅండ్‌హెచ్, విద్యాశాఖ అధికారులు రావడం లేదు. సోషల్ మీడియా కోసం రీల్స్ పెట్టడానికి కొందరు వీడియోలు చేస్తూ హడావిడి చేస్తున్నారు.

కన్నీటి వీడ్కోలు

- శోకసంద్రమైన గోవిందరెడ్డిపల్లి, తిరుమలపల్లి





విశ్వనాథరెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న కృపాలక్ష్మి, విలపిస్తున్న సురేంద్రారెడ్డి

గంగాధరనెల్లూరు : మండలంలోని వేపంజేరి పంచాయతీ, గోవిందరెడ్డిపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డికి కన్నీటి వీడ్కోలు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. మంగళవారం తిరుత్తణికి వెళ్తుండగా కారు బోల్తాపడింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. మరో ముగ్గురు సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందులో విశ్వనాథరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం గురువారం గోవిందరెడ్డిపల్లి గ్రామానికి తీసుకొచ్చారు. నిన్న మొన్నటి వరకు తమ మధ్య సంతోషంగా తిరుగుతున్న వ్యక్తులు దూరమవ్వడంతో గ్రామస్తులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. విశ్వనాథరెడ్డి తల్లిదండ్రులు, అన్న సురేంద్రారెడ్డిని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. చుట్టుపక్కల గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో విచ్చేసి నివాళి అర్పించారు.

పలువురి నివాళి

వైఎస్సార్‌సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి, చిత్తూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఎంసీ విజయానందరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆనగంటి హరికృష్ణ గ్రామానికి చేరుకుని మృతుడు విశ్వనాథరెడ్డికి ఆత్మీయ నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ సీడీసీఎంఎస్ చైర్మన్ వేల్కూరు బాబురెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, నాయకులు మునిరాజారెడ్డి, చిన్నమ్మరెడ్డి, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

తల్లడిల్లిన తిరుమలపల్లి

విశ్వనాథరెడ్డి అన్నకుమార్తె కీర్తి కుమారుడు షాన్విక్‌రెడ్డి(ఏడాది) ప్రమాదంలో మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం విగత జీవిగా గ్రామానికి రావడంతో స్థానికులు తల్లడిల్లిపోయారు. చిన్నారి తండ్రి స్వగ్రామమైన యాదమరి మండలం, తిరుమలపల్లి గ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మరో నెలలో చిన్నారికి పుట్టు వెంట్రుకలు తీసే కార్యక్రమాన్ని నిర్వహించాలనుకుంటున్న తరుణంలో మృత్యువు కబళించింది. ఈ ప్రమాదంలో గాయపడిన చిన్నారి తల్లి కీర్తి, అమ్మమ్మలు రాణిపేట సీఎంసీలో చికిత్స పొందుతున్నారు.


అమ్మో..కొండచిలువ



పొలాల్లోకి వచ్చిన కొండచిలువ

సదుం: పంట పొలాల్లో కొండచిలువ హల్‌చల్ చేసింది. ఈ ఘటన మండలంలో తిమ్మానాయనపల్లె పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. కొర్లకుంటవారిపల్లెకు చెందిన నాగభూషణం కనకాంబరం పూల తోట సమీపంలో గురువారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లిన వారు ఓ కొండచిలువను గుర్తించారు. అది మీదకు రావడంతో స్థానికులు కర్రలతో కొట్టి చంపేసినట్టు తెలిసింది.

తెల్లదొరల పాలనకు చిహ్నం!



కుశస్థలి నదిపై నిర్మించిన రైలు వంతెన

నగరి : పట్టణంలోని కుశస్థలీ నదిపై నిర్మించిన వంతెన బ్రిటీష్ పాలనకు చిహ్నంగా నిలుస్తోంది. 145 ఏళ్లుగా ఈ వంతెన ఉంది. 1880లో డల్హాసి వైశ్రాయ్‌గా ఉన్నప్పుడు ఈ వంతెన నిర్మించారు. ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా నదిపై నిర్మించిన రైల్వే కమ్ రోడ్డు బ్రిడ్జ్‌గా ఇది పేరుపొందింది. స్థానికుల సమాచారం మేరకు.. నగరి నుంచి రేణిగుంట వరకు రైలుమార్గం వేసే ప్రక్రియలో భాగంగా ఈ వంతెన నిర్మించారు. తెల్లరాతి బండలతో 15 స్థూపాలు కలిగిన విధంగా 120 మీటర్ల మేర ఈ వంతెనను నిర్మించారు. అప్పట్లోనే రెండు ట్రాకులతో పాటు రైలుపట్టాల పక్కనే ఒక కారు వెళ్లేలా రోడ్డు నిర్మాణం జరిగింది. అప్పట్లో దీన్ని చూడడానికి జనం ఎగబడి వెళ్లేవారు. తొలి రైలు వెళ్లే సమయంలో అందరూ వచ్చి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. తరాలు మారుతున్నా వంతెన చెరగని గుర్తుగా నిలిచిపోయింది.

తల్లిదండ్రులు మందలించారని!

– ఉరివేసుకుని యువకుడి మృతి



ఆత్మహత్య చేసుకున్న ఉపేంద్ర

బంగారుపాళెం: మండలంలోని వెలుతురుచేను గ్రామంలో గురువారం ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెలుతురుచేను గ్రామానికి చెందిన వేలు కుమారుడు ఉపేంద్ర(18) ప్రవర్తన సరిగా లేకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో అతను మనస్తాపానికి గురై గ్రామ సమీపంలో ఒంటిల్లు వద్ద గల పశువుల పాకలో ఉరివేసుకుని మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి వేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పొట్టకూటి కోసం వెళ్లి.. తిరిగిరాని లోకాలకు!



రవితేజ(ఫైల్)

చౌడేపల్లె: కూలి కోసం వెళ్లి ఓ యువకుడు తిరిగి రాని లోకాలకు వెళ్లాడు. కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగిల్చాడు. వివరాలు.. మండలంలోని చారాలకు చెందిన బాలసుబ్రమణ్యం కుమారుడు రవితేజ(25) ట్రాక్టర్ డ్రై వర్. దుర్గసముద్రం పంచాయతీ, బండమీద పల్లె సమీపంలో గొల్లవానికుంట వద్ద ట్రాక్టర్‌తో మడి దున్నేందుకు వెళ్లాడు. మడిలో దున్నుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని పుంగనూరు పభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రవితేజ మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ భూములకు యాజమాన్య హక్కు పత్రాలు

తవణంపల్లె: గ్రామ కంఠం భూములకు స్వామిత్వ కార్యక్రమం ద్వారా యాజమాన్య హక్కు పత్రాలను కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు తెలిపారు. గురువారం తవణంపల్లె మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు స్వామిత్వ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీపీఓ సుధాకర్‌రావు పర్యవేక్షించి పలు సూచనలు, సలహాలిచ్చారు. ప్రతి గ్రామంలో గ్రామం కఠం భూములను పారదర్శకంగా సర్వే చేసి అనుభవంలో ఉన్న వారికి యాజమాన్య హక్కు పత్రాలు మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. తర్వాత క్షేత్ర స్థాయిలో ఎగువ తవణంపల్లెలో స్వామిత్వ సర్వే ఎలా చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ ఎంపీడీఓ మురుగేష్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 28 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 75,859 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 33,344 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేడు అండర్-15 వాలీబాల్ ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్ : అండర్-15 వాలీబాల్ బాల, బాలికల ఎంపిక నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంతవాణి వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అండర్-15 వాలీబాల్ బాల, బాలికలకు శుక్రవారం ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ఎంపిక పోటీలను చిత్తూరు జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తామన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న క్రీడాకారులకు తగిన సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె సూచించారు.

మళ్లీ వాళ్లే!



- పంద్రాగస్టున చేంతాడంత ఉత్తమ ఉద్యోగుల జాబితా
- ప్రతి ఏటా కొందరినే వరిస్తున్న అవార్డులు
- రిటైర్డ్ అవుతున్నా గుర్తింపు లభించక కుమిలిపోతున్న పలువురు ఉద్యోగులు
- ఉద్యోగుల ఎంపికలో 'పచ్చ' సిఫార్సులు, వ్యక్తిగత విధేయత

చిత్తూరు అర్బన్: 'ఏం చెప్పేదయ్యా..! అటెండరుగా 38 ఏళ్ల క్రితం మునిసిపాలిటీలో చేరాను. ఈ నెలాఖరున రిటైర్‌మెంట్. ఎన్ఎంఆర్‌గా పనిచేస్తూ జీతాలు తీసుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డాను కానీ, ఏ రోజూ డ్యూటీకి ఎగ్గొట్టలేదు. రిటైర్డ్ అయ్యేలోపు ఒక్కసారైనా కలెక్టర్ నుంచి ప్రసంసా పత్రం అందుకోవాలని కలలు కన్నాను. అవి నెరవేరకుండానే ఇంటికి వెళ్లిపోతున్నాను. ఆఫీసర్లను కాకాపట్టేవాళ్లు, చాడీలు చెప్పేవాళ్లకే గుర్తింపు. మా పేర్లంతా కలెక్టర్‌కు పంపరు.'

– జిల్లా కేంద్రంలోని ఓ ఉద్యోగి ఆవేదన

వాళ్ల బాధలు అర్థంకావా?

విధుల్లో నిబద్ధత.. అధికారుల పట్ల గౌరవం ప్రదర్శించే ఉద్యోగులను ఇప్పుడు చేతి వేళ్లపై లెక్కించే పరిస్థితి. ఫలితంగా ప్రతీ ఏటా పంద్రాగస్టు, గణతంత్ర్య దినోత్సవాల నాడు ఉత్తమ అధికారుల ఎంపిక యాంత్రికంగా కానిచ్చేస్తున్నారు. ఒకప్పుడు ఉద్యోగుల పనితీరు, క్రమశిక్షణ, పూర్వపు రికార్డులు పరిశీలించి, పరీక్షించి ఉత్తమ అవార్డుకు అధికారుల్ని ఎంపిక చేసేవారు. ఇప్పుడు ఉన్నతాధికారుల అడుగులకు మడుగులొత్తే వాళ్లు, రాజకీయనాయకుల వద్ద పీఏలు, గుమస్తాలు ఉత్తములైపోతున్నారు. కష్టపడి సేవలందించే అధికారులకు, సిబ్బందికి గుర్తింపు దక్కడం లేదు. ఉద్యోగ విరమణ వయస్సు దగ్గరపడుతున్నా తమ సేవలకు గుర్తింపు లేదని పలువురు కుమిలిపోతున్నారు.

ఒకప్పట్లో...

జిల్లాలోని వివిధ శాఖల్లో 30 వేల మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవం, స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగుల్ని ఎంపికచేసి ప్రశంసా పత్రాలు ఇవ్వడం ఆనవాయితీ. దశాబ్దన్నర కాలం క్రితం వరకు అయితే కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకోవాలంటే సవాలక్ష కారణాలను పరిగణనలోకి తీసుకునే వారు. ప్రశంసా పత్రం తీసుకునే ఉద్యోగులు కుటుంబ సమేతంగా వచ్చి అతిథుల చేతులు మీదుగా అవార్డులు అందుకోవడం ఓ మధురానుభూతిగా భావించేవాళ్లు. కానీ కాలం మారిపోయింది. ఉద్యోగుల జాబితాను తయారు చేయడంలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖాధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తూ వారికి నచ్చిన పేర్లనే ఉన్నతాధికారులకు పంపుతున్నారనే ఆరోపణలున్నాయి.

మళ్లీ మళ్లీ వాళ్లకే!

ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో కొందరు ఉద్యోగులకు ప్రతీ ఏటా ప్రశంసా పత్రాలు ఇవ్వడం, ఉత్తమ ఉద్యోగులుగా సిఫార్సు చేయడంపై ఎన్ని విమర్శలు వస్తున్నా అధికారులు ఏ మాత్రం లెక్కచేయడం లేదు. విధి నిర్వహణలో సస్పెన్షన్లకు గురైన వాళ్లు, చార్జ్ మెమోలు తీసుకున్న ఉద్యోగులు, అవినీతి ఆరోపణలు ఉన్న ఉద్యోగులు, ఏసీబీ అధికారులకు చిక్కిన వాళ్లకు సైతం ఉత్తములంటూ సర్టిఫికెట్లు ఇచ్చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అధికారులైతే నిత్యం వారిని అంటిపెట్టుకుని చెప్పిన పనులు కిమ్మనకుండా చేసే వారిని, నెల పెడితే రూపాయి తగ్గకుండా మామూళ్లు ముట్టజెప్పే వారిని కలెక్టర్ చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు అందుకోవడానికి ఎంపిక చేస్తున్నారని చాలామంది లోలోన మదనపడుతున్నారు. ఈసారి కూడా పలు ప్రభుత్వ శాఖల నుంచి జిల్లా రెవెన్యూ శాఖకు 315 మందికి పైగా పేర్లు అందాయి. ఇంత మందికి ప్రశంసా పత్రాలు ఇవ్వడం సాధ్యం కాదని, జాబితాను కుదించాలని పలు శాఖలకు జాబితాను అధికారులు ఇష్టానుసారం కుదించేస్తూ ఎవర్నిపడితే వాళ్లను ఎంపిక చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగుల ఎంపికలో నీతి, నిజాయితీ, పనితీరు, ఆరోపణలు లాంటి కనీస అంశాలను కూడా ప్రతిపాదనలోకి తీసు కోని అధికారులు దేన్ని కొలమానంగా పరిగణనలోకి తీసుకుని పేర్లను ఎంపిక చేస్తున్నారని వేలాదిమంది ఉద్యోగులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు.